www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 20 నవంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-191 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## అరుణాచల్ ప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం





- ప్రారంభించి జాతికి అంకితం చేసిన ప్రధాని మోడీ
- గతంలో ఈశాన్య రాష్ట్రాలను నిర్లక్ష్యం చేశారని విమర్శలు
- 2019లో శంకుస్థాపన చేస్తే రాజకీయం అంటూ విమర్శించారన్న ప్రధాని

**ఇటానగర్, నవంబర్ 19 (సమ సమాజం):** అరుణాచల్ ప్రదేశ్‌లో నిరమించిన అధునాతన విమానాశ్రయాన్ని జాతికి ప్రధాని మోడీ అంకితం చేశారు. అరునాచల్‌లో ప్రధాని మోడీ శనివారం పర్యటించారు. పర్యటనలో భాగంగా రాష్ట్రంలో తొలి గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని ఆయన ప్రారంభించారు. ఈటానగర్‌లోని హెల్లంగి ప్రాంతంలో 'డోనీ-పోలో' ప్రాంతంలో

2వ



నివాళి అర్పించిన సోనియా, ఖర్గే



## ఇందిరాగాంధీ సమాధి వద్ద శ్రద్ధాంజలి

**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమ సమాజం):** కాంగ్రెస్ నేత, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ.. నివాళులర్పించారు. ఢిల్లీలోని శక్తిస్థల్ లోని ఇందిరాగాంధీ సమాధి వద్ద శ్రద్దాంజలి ఘటించారు. కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా నివాళులర్పించారు. భారత్ జోడో యాత్రలో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించి, పుష్పాంజలి ఘటించారు.భారత మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, కమలా నెహ్రూ దంపతులకు 1917, నవంబర్ 19న ఇందిరాగాంధీ జన్మించారు. 1960లో కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. 1964 నుంచి 1966 వరకు సమాచార, ప్రసారశాఖ మంత్రిగా పని చేశారు. తండ్రి మరణం తర్వాత 1966 జనవరి నుంచి 1977 మార్చి వరకు భారత ప్రధానిగా కొనసాగారు. ఇందిరాగాంధీ దేశానికి మొదటి మహిళా ప్రధాని కావడం విశేషం. 1984 అక్టోబర్ 31న ఇందిరాగాంధీ బాడీ గార్డులే ఆమెను కాల్చి చంపారు.

## పార్లమెంట్ శీతాకాల సమావేశలాకు ముహూర్తం ఖరారు

- డిసెంబర్ 7 నుంచి 29 వరకు సమావేశాల నిర్వహణ అనేక కీలక బిల్లులపై చర్చించే అవకాశం
- సమావేశ వివరాలు వెల్లడించిన మంత్రి ప్రహ్లాద్ జోషి



**న్యూఢిల్లీ, నవంబర్ 19 (సమ సమాజం):** పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. డిసెంబరు 7న సమావేశాలు ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 7నుంచి 29 వరకు సమావేశాలు జరపాలని నిర్ణయించి నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 23 రోజులపాటు కొనసాగే సమావేశాల్లో కీలక అంశాలపై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశాల్లో నిర్మాణాత్మక చర్చ ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ట్వీట్

2వ



## కాశ్మీర్‌లో హిమపాతం..ముగ్గురు జవాన్లుమృతి

**శ్రీనగర్, నవంబర్ 19 (సమ సమాజం):** జమ్మూ కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో విషాదం నెలకొంది. మచిల్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద మంచు చరియలు విరిగిడపడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. శుక్రవారం 56 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన జవాన్ల బృందం పెట్రోలింగ్‌కు వెళ్లింది. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా,

2వ

## కొనసాగుతున్న రాహుల్ పాదయాత్ర



- మహారాష్ట్రలో భారీగా వస్తోన్న స్పందన
- మేథాపాట్కర్‌తో కలవడంపై బిజెపి విమర్శలు

**ముంబై, నవంబర్ 19 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకురావాలని, రానున్న ఎన్నికల్లో తన పార్టీ సత్తా చాటాలనే ధీఢ సంకల్పంతో రాహుల్ గాంధీ చేపట్టిన భారత జోడో యాత్రం నిరాటంకంగా ముందుకు సాగుతోంది. ప్రజలు

2వ

## ఓయూ క్యాంపస్‌లో మరో హాస్టల్

- రూ.39.50 కోట్లతో నిర్మాణానికి నిర్ణయం
- శంకుస్థాపన చేసిన మంత్రులు
- 500 మంది విద్యార్థులకు సరిపడేలా నిర్మాణం



**హైదరాబాద్, నవంబర్ 19 (సమ సమాజం):** ఉస్మానియా యూనివర్సిటీలో బాయ్స్ హాస్టల్ భవనానికి రాష్ట్రమంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని

2వ



## లిక్కర్ స్కామ్‌పై రోజుకో లీక్

- కవిత పేరుందంటూ పదేపదే ప్రస్తావన
- బిజెపి తీరుపై సర్వత్రా విమర్శలు

2వ

## ఫామ్‌హౌజ్ కేసులో సిట్ దర్యాప్తు

- బిజెపి నేత బిఎల్. సంతోష్, శ్రీనివాస్‌లకు నోటీసులు
- సంబంధం లేని వారికి నోటీసులు ఇచ్చారని బిజెపి సవాల్
- హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసిన ప్రేమేందర్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 19 (సమ సమాజం):** ఫామ్‌హౌజ్ కేసులో దర్యాప్తు చేస్తున్న సిట్ ఇచ్చిన నోటీసులపై బీజేపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. బిజెపి జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోష్, అడ్వొకేట్ శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. సిట్ నోటీసులపై స్టే ఇవ్వాలని అందులో అభ్యర్థించారు. కేసుతో సంబంధం లేని వారికి నోటీసులిచ్చి ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ పిటిషన్ పై హైకోర్టు మధ్యాహ్నం 2:30కి విచారణ జరపనుంది. ఇదిలా ఉంటే ఫాం హౌస్ కేసులో

2వ



## శబరిమల యాత్రలో అపశృతి

- లోయలో పడ్డ ఎపి టూరిస్ట్ బస్సు
- 18మందికి గాయాలు..ముగ్గురి పరిస్థితి విషమం

**అమరావతి, నవంబర్ 19 (సమ సమాజం):** ఆంధ్రప్రదేశ్

2వ

## తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న చలి

- ఏజెన్సీ ఏరియాల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అండమాన్ తీరంలో వాయుగుండంతో వర్షాలకు ఛాన్స్

**హైదరాబాద్, నవంబర్ 19 (సమ సమాజం):** తెలుగు రాష్ట్రాల్లో చలి పంజా విసురుతోంది. ఏజెన్సీలో చలి పెరుగుతోంది. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాధారణం కంటే ఐదు డిగ్రీలు తక్కువ నమోదు అవుతోంది. అల్లూరి జిల్లా చింతపల్లిలో 9.4 డిగ్రీల ఉష్ణోగ్రత

2వ



# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల్లో శృతిమించుతున్న రాజకీయాలు !

తెలుగురాష్ట్రాల్లో రాజకీయాలు భ్రష్టు పట్టిపోతున్నాయి. నేతలు హుందాతనం కోల్పోతున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే అయినా అవి కూడా హద్దులు దాటుతున్నాయి. వాడరాని భాష వాడుతున్నారు. రాయరాని భాషలో మాట్లాడుతున్నారు. రాజకీయాల్లో గతంలో దాడులు, ప్రతిదాడులు ఎప్పుడూ ఉండేవి కావు. అడపాదడపా క్షేత్రస్థాయిలో స్వల్ప ఘటనలు మాత్రమే చోటు చేసుకునేవి. కానీ ఇప్పుడా పరిస్థితి కానరావడం లేదు. అధికార పార్టీ, విపక్ష పార్టీ అన్న తేడా లేకుండా దాడులకు, ప్రతిదాడులకు తెగబడు తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. విమర్శలకూ ఓ హద్దు ఉండాలన్న ఇంగితాన్ని మరచి నేతలు ప్రవర్తి స్తున్నారు. రాజకీయాల్లో విమర్శలు సమజమే అయినా అవి హద్దులు దాటడమే వికృత పరిణామానికి పరాకాష్టగా చూడాలి. భాషను ఎలా వాడుకోవాలో తెలియడం లేదు. ఎత్తులు పై ఎత్తులు వేయడం అవసరమే కానీ దాడులు చేయడం అవసరమా అన్నది ఆలోచన చేయాలి. ఎదుటి వారి ఇండ్లపై దాడులు చేసే స్థితికి నేతలు రావడం సరికాదు. ఎదుటివారు ఎంతగా రెచ్చగొట్టేలా చేసినా..అంతకు పదింతలుగా అలాంటి పంథానే ఎన్నుకోవాలి. కానీ దాడులతో కట్టడి చేయాలనుకుంటే సరికాదు. తాజాగా బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్సీ కవితల మధ్య నడిచిన డైలాగ్ వార్ కాస్తా దాడులకు దారితీసింది. ఇది ముమ్మాటికీ అవాంఛనీయం. ఇలాంటి ఘటనలు జరగరాదు. అలాంటి పరిస్థితులకు రాజకీయ నాయకులు కారణం కారాదు. తెలంగాణలో షిండే మాడల్ రాజకీయాలు చేద్దామంటూ బీజేపీ సన్నిహితులు కొందరు తనతో ప్రతిపాదించారని, దాన్ని తాను నిర్ద్వంద్వంగా తిరస్కరించానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెల్లడించారు. నిజానికి అలాంటి ప్రతిపాదనే వచ్చివుంటే దాన్ని బహిర్గం చేయడం ద్వారా కవిత వారిని ఎండగట్టవచ్చు. కానీ తాను కాంగ్రెస్‌లో చేరడానికి ఖర్గేతో సంప్రదించానని ధర్మపురి అర్వింద్ చేసిన వ్యాఖ్యల పై అతిగా ప్రవర్తించారు. నిజానికి ఆమె చెప్పింది నిజమా అబద్దమా అన్నది నిగ్గు తేల్చాలి. ఇకపోతే కవిత సిఎం కెసిఆర్ కూతురు. ఎమ్మెల్సీ కూడా. గతంలో ఎంపిగానూ పనిచేశారు. అలాంటి కవితను బిజెపిలో చేరమని అడుగుతారని అంటే ఎవరు కూడా నమ్మడం లేదు. అయితే ధర్మపురి అర్వింద్ కూడా ఇష్టం వచ్చిన ట్లుగా మాట్లాడడం సరికాదు. విమర్శలను ప్రజలు ఆలోచించే విధంగా చేయాలి. నిజాలు ఉంటేనే మాట్లాడాలి. ఈ క్రమంలో తెలంగాణ ప్రజలకు క్షమాపణలు కోరుతూనే అర్వింద్‌ను నడిబజారులో చెప్పుతో కొడతానని, చంపుతానని ఎమ్మెల్సీ కవిత అనడం ఎంతవరకు సమంజసమో చెప్పాలి. ఇదేనా రాజకీయం అంటే అన్నది కవిత చెప్పాలి. తన అక్కసును మరో రకమైన భాషలో చెప్పవచ్చు. అర్వింద్ భాషలోనే చెప్పవచ్చు. కానీ ఇలాంటి సంస్కార హీనత సరికాదు. ఎపిలోనూ ఇటీవల టిడిపినేతలపై దాడులకు తెబడుతున్నారు. అక్రమంగా కేసులు బనాయిస్తున్నారు. నాయకులు యాత్రలు చేస్తుంటే అడ్డుకుంటున్నారు. ఎక్కడ కాలు బయటపెట్టిన పోలీసులు నో చెబుతున్నారు. సభలూసమావేశాలు నిర్వహించుకోకుండా చేస్తున్నారు. కేసులు పెట్టి వేధిస్తున్నారు. విపక్షాలను అడ్డుకోవడం కోసం ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. కర్నూలు సభలో చంద్రబాబును నిలదీసేలా వైసిపి కార్యకర్తలు మాట్లాడారు. అలాగే నందిగామలో గతంలో రాళ్లు విసిరారు. దీంతో చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ అధికారికి దెబ్బ తగింలింది. ఇది చంద్రబాబు ఒక్కరికే జరగలేదు. టిడిపి, బిజెపి నేతలకు జరిగింది. పవన్ కళ్యాణ్ ఎక్కడకు వెళ్లినా అడ్డుకునే ప్రయత్నాలు కూడా చేశారు. అడ్డుకున్నారు. రాళ్లు వేశారు. రోడ్లు మూశారు. ఇలా చేయరాని పనులన్నీ చేస్తూనే ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును శుక్రవారం కర్నూలులో వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్న తీరును సమర్థించుకుంటున్నారు. అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. చంద్ర బాబూ గో బ్యాక్.. రాయలసీమ ద్రోహి చంద్రబాబు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నల్లబెలూన్లు ఎగుర వేశారు. చంద్రబాబు బస చేసిన ప్రదేశంలో నిరసన తెలిపేందుకు కొందరు యత్నిం చారు. మరికొందరు నిరసనకారులు జడ్‌ప్లస్ భద్రత ఉన్న చంద్రబాబు కారుకు అడ్డంగా వచ్చి ఆపే ప్రయత్నం చేయడం భద్రతా వైఫల్యాలను ఎత్తి చూపింది. మొత్తంగా రాజకీయాల్లో హింసను జొప్పిస్తు న్నారు. ఎవరిది పైచేయి అనేకన్నా అనేక సందర్భాల్లో అధికార పార్టీకి పోలీసులు వత్తాసుగా మారారు. దాడులకు తెగబడుతున్నా చూసీచూడ నట్లుగా మిన్నికుంటున్నారు. ఇలాగే హైదరాబాద్‌లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇంటిపై టీఆర్ఎస్ నాయకులు దాడికి తెగబడ్డారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని నివాసంలోకి పోలీసులు చూస్తుండగానే దూసుకెళ్లి ఫర్నీచర్, కిటికీ అద్దాలు, దేవుడి పటాలు ధ్వంసం చేశారు. కార్లతో పాటు ఇంట్లో ఉన్న పలు వస్తువులూ పగులగొట్టారు. పని మనిషి, సెక్యూరిటీ గార్డును గాయపరిచారు. ఇందుకు ప్రతిగా రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళనలు చేశారు. కేసీఆర్, కవిత దిష్టిబొమ్మలు దహనం చేశారు. టీఆర్ఎస్ జెండా కర్రలతో ఇంటి కిటికీలను ధ్వంసం చేశారు. రాళ్లు విసురుతూ బీభత్సం సృష్టించారు. హాల్‌లో ఉన్న గ్లాస్ టేబుల్, టీ పాయ్, షోకేస్ అద్దాలను పగులగొట్టారు. దేవుడి ఫొటోలపై రాళ్లు విసిరి ధ్వంసం చేశారు. ఫర్నిచర్‌ను చెల్లాచెదురు చేశారు. అడ్డొచ్చిన సెక్యూరిటీ గార్డు రమణ, హౌస్ కీపర్ సత్యవతిపై దాడి చేశారు. వారిని బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారు. ఇందుకు ప్రతిగా ఎంపీ అర్వింద్ ఇంటిపై దాడికి నిరసనగా తెలంగాణ భవన్‌ను ముట్టడిస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించ డంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. తెలంగాణ భవన్‌తో పాటు ఎమ్మెల్సీ కవిత ఇంటికి భారీగా భద్రత కల్పించారు. అర్వింద్ ఇంటి నుంచి తెలంగాణ భవన్ ముట్టడికి ర్యాలీగా బయల్దేరిన బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ భవన్ వద్ద వంద మందికిపైగా పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కవిత ఇంటికి సెక్యూరిటీ పెంచారు. ఎంపీ అర్వింద్ ఇంటి ముట్టడి, దాడి ఘటనలో పోలీసుల వైఫల్యం కనిపించింది. టీఆర్ఎస్, జాగృతి లీడర్లు, కార్యకర్తలు అర్వింద్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టి.. దాడి చేయాలని ప్లాన్ చేసుకున్నారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇంటిపై టీఆర్ఎస్ నేతల దాడి ఘటనపై డిటెయిల్డ్ రిపోర్ట్ ఇవ్వాలని డీజీపీ మహేందర్ రెడ్డిని గవర్నర్ తమిళిసై ఆదేశించారు. ఇలా ఓ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోవడం కూడా పరిస్థితి తీవ్రతను తెలియ చేస్తోంది. మొత్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు శృతి తప్పుతున్నాయి. హద్దులు మీరుతున్నాయి. దాడులకు నేతలు తెగబడుతున్నారు. ఇది ఫ్యాక్షన్ తరహా రాజకీయం తప్ప మరోటి కాదు. వాంఛనీయం అస్సలు కాదు. ఇలాంటి వాటికి స్వస్తి చెప్పాలి. లేకుంటే ప్రజలు అయినా ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న చలి



(మొదటి పేజి తరువాయి) నమోదై.. ఇటు కొమురం భీం జిల్లా సిర్పూర్(యు)లో 9.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక ఏజెన్సీ ఏరియాలో పాడేరు,అరకులో 12 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఇటు చింతపల్లి ఏజెన్సీలో సాయంత్రం నుంచే మంచు కురుస్తోంది. చలిగాలులు వీస్తుండడంతో మన్యం వాసులు వణికిపోతున్నారు. పొగమంచుతో మన్యం తడిసి ముద్దవుతోంది. చలి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య ప్రాంతాల నుంచి తెలంగాణలోకి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నందున చలి పెరుగుతున్నట్లు వాతావరణశాఖ వివరించింది. పగటిపూట పొడి వాతావరణం ఉంటుందని తెలిపింది.తెలంగాణలో వచ్చే వారంపాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. అక్కడక్కడ కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు పడిపోతాయని పేర్కొన్నది. 21, 22 తేదీల్లో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. రాష్ట్రంలో శుక్రవారం అత్యల్పంగా మెదక్‌లో 12 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 13.2, హైదరాబాద్‌లో 14.2, దుండిగల్‌లో 15.2, నల్లగొండలో 15.4, హనుమకొండలో 15.5, రామగుండంలో 15.6, హకీంపేటలో 15.9, నిజామాబాద్‌లో 16.1, ఖమ్మంలో 17, మహబూబ్‌నగర్‌లో 18.1, భద్రాచలంలో 19 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ తెలిపింది. ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌కి మరోసారి వాన ముప్పు ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించింది. దక్షిణ అండమాన్ సమీపంలో ఆగ్నేయ బంగాళాఖాతంలో గురువారం ఏర్పడిన అల్పపీడనం..పశ్చిమ వాయవ్యదిశగా ప్రయాణించి వాయుగుండం గా బలపడుతున్నదని, ఈ నెల 19 నాటికి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని అంచనా వేసింది. ఈ ప్రభావంతో రాబోయే మూడు రోజులు కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతున్న క్రమంలో తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు వెళ్లే అవకాశం ఉంది. ఈ ద్రోణి ప్రభావం వల్ల ఈ నెల 20 నుంచి ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు పడొచ్చునని, అలాగే తమిళనాడు, పుదుచ్చేరిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. 20, 21, 22 తేదీల్లో దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, 21, 22 తేదీల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అటు 40-55 కిమీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు.

# ఓయూ క్యాంపస్‌లో మరో హాస్టల్



(మొదటి పేజి తరువాయి) శ్రీనివాసయాదవ్‌లు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, యూనివర్శిటీ వీసీ రవీందర్ పాల్గొన్నారు. క్యాంపస్‌లో చదువుతున్న విద్యార్థులందరికీ హాస్టల్ సదుపాయం కల్పించడం కోసం యూనివర్సిటీలో మరో నూతన హాస్టల్ నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకోసం రూ.39.50 కోట్లు కేటాయించారు. క్యాంపస్‌లో 500 మంది విద్యార్థులు ఒకే భవనంలో ఉండే విధంగా డిజైన్ నిర్ణయించారు. జీప్లస్ 3 అంతస్తులతో దీనిని నిర్మిస్తున్నారు. హాస్టల్ భవనం నిర్మించడంతో పాటు ఇంటర్నల్ వాటర్ సదుపాయం, శానిటరీ విధానం ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇంటర్నల్ ఎలక్ట్రికల్‌ను ఇన్‌స్టాల్ చేయనున్నారు. ఈ భవన నిర్మాణ బాధ్యతలు తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (టీఎస్ఈడబ్ల్యూఐడీసీ) అప్పగించినట్లు ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో అత్యాధునిక వసతులతో 2.76 ఎకరాల్లో రూ.39.50 కోట్ల అంచనా వ్యయంతో, 1,06,292 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. 3 అంతస్థుల్లో 500 మంది విద్యార్థులకు వసతి కల్పించే ఈ హాస్టల్‌ను ఏడాదిలోపు అందుబాటులోకి తేనున్నారు. ప్రస్తుతం ఓయూలో 24 హాస్టళ్లు ఉండగా, ఇందులో బాయ్స్ (12), ఉమెన్స్ (12). వర్సిటీలో 70శాతానికి పైగా అమ్మాయిలే ఉండటంతో బాలుర హాస్టల్‌ను గతేడాది అమ్మాయిలకు కేటాయించారు. అబ్బాయిలు ఉండేందుకు హాస్టళ్లు లేకపోవడంతో నూతన హాస్టల్ నిర్మాణానికి టీఎస్ఈడబ్ల్యూఐడీసీ అధికారులు టెండర్లు పూర్తిచేశారు.

## శబరిమల యాత్రలో అపశృతి

(మొదటి పేజి తరువాయి) నుంచి శబరిమలకు వెళ్తున్న బస్ ప్రమాదవశాత్తు లోయలో పడి 18 మంది అయ్యప్ప భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరుకు చెందిన 84 మంది అయ్యప్ప భక్తులు శబరిమలలోని అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు రెండు టూరిస్టు బస్సుల్లో బయలు దేరారు. వీరు ప్రయాణిస్తున్న ఒక బస్సు కేరళలోని పట్టణంథిట్ట వద్ద లోయలో పడింది. బస్సు ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా స్టీరింగ్ క్షతగాత్రులు తెలిపారు. ఏలూరు జిల్లా మాదేపల్లి ప్రాంతానికి చెందిన 18 మంది భక్తులు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా ఘటన విషయాన్ని తెలుసుకున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి క్షతగాత్రులకు వైద్యం సహాయం నిమిత్తం కేరళ ప్రభుత్వంతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజల విశ్వాసం కోల్పోయిన టిఆర్ఎస్ ప్రభుత్వం

ప్రశ్నించే వారిని భయపెట్టడానికే ఈ దాడులు
పథకం ప్రకారమే ధర్మపురి అరవింద్ ఇంటిపై దాడి
అరవింద్ తల్లిని పరామర్శించిన ఈటెల రాజేందర్

హైదరాబాద్, నవంబర్ 18 (సమ సమాజం): ప్రజల విశ్వాసం కోల్పోయిన టిఆర్ఎస్ ప్రభుత్వం.. ప్రజల పక్షాన ఉన్న వారిని, ప్రశ్నించే వారిని భయపెట్టడానికి ఈ దాడులు చేస్తోందని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ ఇంటిపై దాడి పథకం ప్రకారమే దాడి జరిగిందని అన్నారు. కాళ్ళకింద భూమి కదిలిపోయి గెలవలేమని దాడులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీ ఇంటిమీద పోలీసుల పర్యవేక్షణలో ఈ దాడి జరిగిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న దాడులను తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. అరవింద్ తల్లి విజయలక్ష్మిని ఆయన పరామర్శించారు. ప్రజల పక్షాన ఉన్న వారిని, ప్రశ్నించే వారిని భయపెట్టడానికి ఈ దాడులు చేస్తోందని అన్నారు.

# అరుణాచల్ ప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం



(మొదటి పేజి తరువాయి) విమానాశ్రయాన్ని నిర్మించారు. 2019 నవంబర్‌లో ఈ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. ఈ విమానాశ్రయాన్ని సుమారు రూ.645 కోట్లతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా నిర్మించింది. తాజాగా ఈ ఎయిర్‌పోర్టు శనివారం అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడారు. తాను 2019లో విమానాశ్రయానికి శంకుస్థాపన చేసినప్పుడు కొంత మంది రాజకీయనేతలు విమర్శలు గుప్పించారని అన్నారు. ఎన్నికల కోసమే శంకుస్థాపన అని, అసలు విమానాశ్రయాన్ని నిర్మించరంటూ ఆరోపణలు చేశారన్నారు. తాజాగా విమానాశ్రయం ప్రారంభోత్సవంతో వారికి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్టు అయ్యిందన్నారు. స్వాతంత్ర్య తర్వాత ఈశాన్య రాష్ట్రం భిన్నమైన యుగానికి సాక్షిగా మారిందన్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి బలైపోయిందని ఆయన అన్నారు. వాజ్‌పేయీ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిని మార్చేందుకు కృషి జరిగిందన్నారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత అటల్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని ముందుకు తీసుకెళ్ల లేదన్నారు. ఈశాన్య రాష్ట్రాలంటే సుదూర ప్రాంతాలని గత ప్రభుత్వాలు అనుకునేవన్నారు. కానీ తమ ప్రభుత్వం ఈశాన్య ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సేవ చేసేందుకు మీరు మాకు అవకాశం కల్పించారని తెలిపారు. దీంతో ఈశాన్యంలో మార్పు తెచ్చేందుకు మరో శకం ప్రారంభమైన్నట్లైందన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ విమానాశ్రయంలో 8 చెక్‌ఇన్ కౌంటర్లు ఉన్నాయి. వీటితోపాటు వెయిటింగ్ హాల్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం 4,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో విమానాశ్రయాన్ని నిర్మించారు. ఈ విమానాశ్రయంలో 2,300 మీటర్ల పొడవైన రన్?వేను నిర్మించారు. దీనిపై బోయింగ్-747 లాంటి భారీవిమానాలను సులభంగా ల్యాండింగ్, టేకాఫ్ చేయవచ్చని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తదితరులు పాల్గొన్నారు.

## ఫామ్‌హౌజ్ కేసులో సిట్ దర్యాప్తు

(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ నేతృత్వంలోనే సిట్ పలువురికి నోటీసులు జారీ చేసింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కరీంనగర్‌కు చెందిన న్యాయవాది శ్రీనివాస్‌లకు సిట్ నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని కార్యాలయంలో నవంబర్ 21న ఉదయం 10.30 గంటలకు సిట్ ఎదుట హాజరుకావాలని 41ఏ సీఆర్పీసీ నోటీసులు ఇచ్చింది. అయితే కుట్రలో భాగంగానే వారికి 41ఏ కింద నోటీసులు ఇచ్చారని బీజేపీ ఆరోపిస్తోంది. ఇదిలావుంటే ఫాం హౌస్ కేసులో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ నేతృత్వంలోని సిట్ దర్యాప్తు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కరీంనగర్‌కు చెందిన న్యాయవాది శ్రీనివాస్‌లకు సిట్ నోటీసులు జారీ చేసింది. అయితే ఈ నోటీసుల్లో గందరగోళం నెలకొన్నట్లు తెలుస్తోంది. బీఎల్ సంతోష్‌తో పాటు నలుగురికి జారీ చేసిన నోటీసుల్లో విచారణకు వచ్చేటప్పుడు 9449831415 నంబరు సిమ్‌తో పాటు ఐఎంఈఐ నంబరు 353846108969790తో కూడిన సెల్‌ఫోన్‌ను వెంట తీసుకురావాలని సూచించింది. అయితే ముగ్గురికి ఇచ్చిన నోటీసుల్లో ఒకే నెంబర్ తీసుకురావాలని ఉండటం చర్చనీయాం శంగా మారింది. కేవలం పేరు, అందిన తర్వాత మొబైల్స్‌లోని డేటాను ట్యాంపర్ చేయొద్దని విచారణ అధికారి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి గంగాధర్ నోటీసుల్లో పేర్కొన్నారు. అలాంటి ప్రయత్నం చేస్తే ప్రాసిక్యూషన్‌కు గురవుతామని హెచ్చరించారు. విచారణాధికారులకు సిట్ నోటీసులు జారీచేయడాన్ని సవాలు చేస్తూ బీజేపీ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. కేసును పర్యవేక్షిస్తున్న సింగిల్ జడ్జి అనుమతి పొందిన కుట్రలో భాగంగానే ఆయనకు 41ఏ కింద నోటీసులు ఇచ్చారని ఆరోపించింది. బీఎల్ సంతోష్, లాయర్ శ్రీనివాస్‌కు నోటీసుల్లో ఒకే సెల్ నెంబర్ పెట్టారని చెప్పారు. దర్యాప్తు పేరుతో కేసుకు సంబంధం లేని వాళ్లను వేధించేందుకు కుట్ర జరుగుతోందని పిటిషన్‌లో పేర్కొంది.

## కాశ్మీర్‌లో హిమపాతం ..ముగ్గురు జవాన్లుమృతి

(మొదటి పేజి తరువాయి) ప్రమాదవశాత్తు మంచు చరియలు విరిగి పడటంతో.. ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. హిమపాతంలో చిక్కుకుపోయిన మరో ఇద్దరు జవాన్లను రక్షించి, కుప్వారాలోని మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన జవాన్లకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. అక్టోబర్‌లో ఉత్తరాఖండ్‌లో సంభవించిన హిమపాతం కారణంగా 27 మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## పార్లమెంట్ శీతాకాల సమావేశలాకు ముహూర్తం ఖరారు

(మొదటి పేజి తరువాయి) చేశారు. ఈ సమావేశాల్లో పలు బిల్లులు, అంశాలపై చర్చిస్తామన్నారు. నిర్మాణాత్మక చర్చ కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. కాగా, పార్లమెంట్ సమావేశాల కంటే ముందే నవంబర్ 21వ తేదీన ప్రి బడ్జెట్ సమావేశాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఈనెల 21 ప్రి బ్జడెట్ సమావేశాలను ప్రారంభిస్తారు. 2023-24 ఆర్థికసంవత్సర బడ్జెట్ తయారీకి సూచనలు కోరుతూ మంత్రి సమావేశాలు నిర్వహించనున్నారు. పరిశ్రమల చాంబర్లు, మౌలిక సదుపాయాలు, పర్యావరణ రంగం నిపుణులతో వర్చువల్‌గా భేటీ అవుతారు. 22న వ్యవసాయం, ఆర్థిక రంగం, క్యాపిటల్ మార్కెట్ల తినిధులతో సమావేశమవుతారు. 24న ఆరోగ్యం, విద్య, పారిశుధ్యం సహా పలు రంగాలకు చెందిన నిపుణులతో భేటీ కానున్నారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో సమర్పించే 2023-24 బ్జడెట్ రూపకల్పనకు నిపుణులు సూచనలు ఇవ్వనున్నారు.

## లిక్కర్ స్కామ్‌పై రోజుకో లీక్

హైదరాబాద్, నవంబర్ 18 (సమ సమాజం): ఢిల్లీ లిక్కర్‌స్కాంకు సంబంధించి రోజుకో వార్త బయటకు వస్తున్నది. రోజుకొకరిని అరెస్ట్ చేస్తున్నారు. లేదా ప్రశ్నిస్తున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్సీ కవిత పేరు ఉందని పదేపదే బిజెపి నేతలు ప్రచారం చేస్తున్నారు. అలాగని ఆమెకు ఎలాంటి నోటీసులు కూడా ఇవ్వలేదు. విచారణ కూడా చేయలేదు. అయినా విమర్శలు మాత్రం ఆగడం లేదు. ఈ క్రమంలో తనకు అధికారికంగా ఎలాంటి సమన్లు అందలేదని కవిత స్పష్టంచేశారు. బీజేపీనాయకులు మాత్రం అనధికారికంగా రోజుకో లీకు ప్రచారంలో పెడుతున్నారని ఆమె దుయ్యబట్టారు. ఈ వ్యవహారంలో తనపై ఎవరూ మాట్లాడొద్దని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని కవిత గుర్తుచేశారు. నిజానికి ఇప్పటి వరకు ఐటి, ఈడి దాడులన్నీ విపక్షనేతలను లక్ష్యంగా చేసుకుని చేస్తున్నవే తప్ప మరోటి కాదు. అధికార పార్టీకి చెందిన వారిపై ఇలాంటి దాడులు జరిగినట్లుగా ఎక్కడా సమాచారం లేదు. అందుకే బీజేపీ నేతలపై ఈడీ దాడులు ఎందుకు జరగవని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు 25వేల మంది ప్రతిపక్ష నాయకులపై ఈడీ, సీబీఐ, ఐటీ కేసులు నమోదు చేశారని ఆమె వివరించారు. ఇందులో ఒక్క బీజేపీ నేతపైనా కేసులు ఎందుకు నమోదు కాలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల ఇండ్లకు ఈడీ, ఐటీలు ఎందుకు వెళ్లవని ఆమె నిలదీశారు. బీజేపీలో చేరగానే పవిత్ర గంగాజలంతో పునీతులు అవుతారా? ఆ పార్టీలో చేరగానే వాషింగ్ పౌడర్‌లా స్వచ్ఛంగా మారిపోతారా? జై మోదీ.. అంటే నై ఈడీలా బీజేపీ వ్యవహరిస్తున్నదని నిలదీశారు. నిజానికి దీనిపైనా ఆలోచనచేయాలి. ఎవరు కళంకితుల అయినా విచారణ చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. సీబీఐ, ఈడీ ఐటీ కేసులున్నవాళ్లంతా దోషులుగా చిత్రీకరిస్తున్నారు. కాంగ్రెస్, ఆప్, టిఆర్ఎస్, తృణమూల్ నేతలు మాత్రమే ఇప్పటి వరకు కేసులకు గురయ్యారు. కేసుల విషయంలో బీజేపీ ఎలా వ్యవహరిస్తున్నదో దేశమంతా చూస్తున్నది. ఇలాంటి రాజకీయాలు ఎంతోకాలం సాగవని బిజెపి గుర్తించాలి. ఎదుటివారిని రాజకీయంగా పజలు కూడా గుర్తింంచారు. బీజేపీ చిల్లర వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఈడీ, సీబీఐ, ఐటీలను బీజేపీ ఎలా వాడుకుంటున్నదో బీహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ గతంలోనే ప్రస్తావించారు. మమతా బెనర్జీకూడా అలాగే చెప్పారు. తెలంగాన సిఎం కెసిఆర్ కూడా ఇదే చెప్పారు. ఇటీవల జార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్‌ను కూడా వదలలేదు. ఈడీ, సీబీఐ, ఐటీ వ్యహారాలపై సోరేన్ ఘాటుగగానే స్పందించారు.

# కొనసాగుతున్న రాహుల్ పాదయాత్ర

(మొదటి పేజి తరువాయి) అడుగడుగున్నా నీరాజనం పడుతున్నారు. పలువురు సెలబ్రిటీలు కూడా కలసి నడుస్తున్నారు. మోడీ విధానాలను వ్యతిరేకిస్తున్న వారు సైతం రాముల్ జోడోకు మద్దతుగా నిలుస్తున్నారు. మహారాష్ట్రలోని షేగాన్ నుంచి జల్‌గావ్ వరకు యాత్ర సాగుతోంది, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ప్రాంతీయ నేతలతో రాజకీయ చర్చలు చేస్తూ పాదయాత్ర చేసుకుంటూ వెళ్తున్న రాహుల్ గాంధీ ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్నారు. తన పర్యటనలో భాగంగా ఆయన ఆ రాష్ట్రంలోని వాషిమ్‌లో మేధా పాట్కర్‌తో కలిసి నడిచారు. బీజేపీని లక్ష్యంగా చేసుకుని..సోషల్ మీడియా ద్వారా ఎన్నికలను రిగ్గింగ్ చేయవచ్చని, సోషల్ మీడియా కంపెనీలు కోరుకుంటే, వారు ఏ పార్టీనైనా ఎన్నికల్లో గెలిపించగలరు. ఒక సిద్ధాంతం, దాని నాయకులు సమాజంలో అశాంతిని కలిగించడానికి మతపరమైన హింసను వ్యూహాత్మక ఆయుధంగా పెంచుతున్నారని అన్నారు. అయితే గుజరత్ రాష్ట్రానికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపినవారితో రాహుల్ గాంధీ చేతులు కలిపారని.. మేధా పాట్కర్ గుజరాతీ వ్యతిరేకి అని బీజేపీ ఆగ్రహించింది. ఈ మేరకు కమలం పార్టీ శుక్రవారం రాహుల్ గాంధీ మీద, కాంగ్రెస్ పార్టీ మీద మండిపడింది. గుజరాత్, గుజరాతీల పట్ల కాంగ్రెస్, రాహుల్ గాంధీ పదే పదే తమ వైరాన్ని ప్రదర్శిస్తున్నారు. మేధా పాట్కర్‌కు తన యాత్రలో కేంద్ర స్థానం కల్పించడం ద్వారా, దశాబ్దాలుగా గుజరాతీలకు నీళ్లు ఇవ్వని వారితో తాను నిలబడతానని రాహుల్ గాంధీ చెప్పకనే చెప్తున్నారు. దీన్ని గుజరాత్ సహించదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కాంగ్రెస్‌పై మండిపడ్డారు. గుజరాత్‌లో 2017లో ప్రారంభమైన సర్దార్ సరోవర్ డ్యామ్‌కు వ్యతిరేకంగా మేధా పాట్కర్ ప్రచారం చేశారు.

# దళితబంధు కోసం లంచం ఇవ్వరాదు

## అలా ఎవరైనా అడిగితే దృష్టికి తెండి: దానం

**హైదరాబాద్, నవంబర్ 18 (సమ సమాజం):** అర్హులైన ప్రతి ఒక్కరికీ దళితబంధు వస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఖైరతాబాద్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. పథకం అమలు కోసం ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దళితబంధు కోసం లంచం ఇచ్చినా, తీసుకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దళితబంధు ఇవ్వాలని సీఎం కేసీఆర్ అదేశించారని చెప్పారు. అర్హులందరూ దళితబంధును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి విడతలో 100 మందికి, 2వ విడతలో 500 మంది లబ్దిదారులకు దళితబంధు పథకం వర్తిస్తుందని వివరించారు. బస్తీ వాసులతో త్వరలోనే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని చెప్పారు. బంజారాహిల్స్ లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో రెండవ విడత దళితబంధు పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేష్, మన్నె కవితా రెడ్డి, స్థానిక టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులు

## స్కానింగ్ మిషన్లు ప్రారంభించిన గంగుల





**కరీంనగర్, నవంబర్ 18 (సమ సమాజం):** కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఇప్పటికే ఆస్పత్రులను ఆధునీకరించామని అన్నారు. కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఝూవేరియా, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి స్కానింగ్ మిషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మిషన్ల పనితీరును అడిగి తెలుసుకొని, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రిలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో తీసుకుంటున్న చర్యలు, అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, పలు సూచనలు చేశారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరిస్తూ నిరుపుదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని భావించిన సీఎం కేసీఆర్.. ఆరోగ్య తెలంగాణ కోసం ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతున్నా రన్నారు. అత్యాధునిక మిషనరీలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు వైద్యం అందించేందుకు గొప్ప సంస్కరణలు చేపట్టామన్నారు. ఏర్పాటు చేసిందని చేసిందని వివరించారు.

# ఫార్ములా వన్ రేస్

## నగరంలో భారీగా ట్రాఫిక్ జామ్



**హైదరాబాద్, నవంబర్ 18 (సమ సమాజం):** హైదరాబాద్ సిటీలో ఫుల్ ట్రాఫిక్ జాం అయింది. ఫార్ములా వన్ రేస్ కారణంగా పోలీసులు ట్రాఫిక్ డైవర్ట్ చేయడం వాహనదారులను ఇబ్బందులకు గురి చేసింది. కొన్ని రూట్లు మూసివేయడంతో రద్దీ పెరిగి ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. మసాబ్ ట్యాంక్, అసెంబ్లీ రూట్?తో పాటు పంజాగుట్ట, సికింద్రాబాద్ మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామైంది. సికింద్రాబాద్ నుంచి అసెంబ్లీ వైపు వెళ్లే వాహనాలన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ట్యాంక్ బండ్, తెలుగు తల్లి ÷÷-ల ఓవర్ మార్గంలోనూ పరిస్థితి దారుణంగా ఉంది. ఆ రూట్లో వాహనాలు ముందుకు కదలడం లేదు. గంటల తరబడి ట్రాఫిక్?లో చిక్కుకుపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. ఫార్ములా ఈ రేసింగ్ కారణంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ డైవర్షన్ కారణంగా ఖైరతాబాద్ క్రాస్ రోడ్స్, షాదాన్ కాలేజ్, నిరంకారీ భవన్, సైఫాబాద్ ఓల్డ్ పీఎస్, టెలిఫోన్ భవన్ నుంచి ఇక్బాల్ మినార్ వైపు మార్గంలో రద్దీ నెలకొందని ప్రకటించారు. మరోవైపు దారి మళ్లింపు కారణంగా సరోజినీదేవి కంటి ఆస్పత్రి, ఎన్ఎండీసీ, మాసబ్ ట్యాంక్, మహావీర్ హాస్పిటల్, అయోధ్య జంక్షన్, నిరంకారీ నుంచి షాదాన్ వైపు వెళ్లే వాహనాలు మూమెంట్ స్లోగా ఉంటుందని చెప్పారు. ఈ మార్గాల్లో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని పోలీసులు సూచించారు. సైఫాబాద్, ఆసిఫ్ నగర్ ట్రాఫిక్ పోలీసులు రద్దీని క్రమబద్దీకరిస్తారని ప్రకటించారు.

# మహబూబ్‌నగర్ జిల్లాకు నర్సింగ్ కళాశాల

## ఈ నెలలోనే కళాశాలను ప్రారంభానికి సన్నాహాలు

## పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



**మహబూబ్‌నగర్, నవంబర్ 18 (సమ సమాజం):** మహబూబ్‌నగర్ జిల్లాకు నర్సింగ్ కళాశాల మంజూరు అయినట్లు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈనెలలోనే కళాశాలను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. డిసెంబర్ నుండి నర్సింగ్ కళాశాలలో తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు, జిల్లా ఎస్పీ ఆర్. వెంకటేశ్వర్లు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మితో నర్సింగ్ కళాశాల ప్రారంభంపై సమీక్షించారు. ప్రస్తుతానికి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి భవనంలోని పైభాగంలో కళాశాలను ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. నర్సింగ్ కళాశాలకు త్వరలోనే పక్కా భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందుకుగాను గతంలోనే భూమిని కూడా సేకరించి సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. మొదటి బ్యాచ్‌లో 60 మందితో ప్రారంభం కానున్న మహబూబ్‌నగర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో భవిష్యత్తులో అవసరమైన అన్ని వసతులను కల్పించడంతోపాటు, మరింత మంది చదువుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. సాధ్యమైనంత త్వరగా నర్సింగ్ పీజీ కళాశాల కూడా తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు.జిల్లాలో గతంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అరకొర వసతులు, డాక్టర్లు, నర్సుల కొరతతో ఇబ్బందుల్లో ఉండేదని.. ప్రస్తుతం ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలను మెరుగుపరిచినట్లు మంత్రి తెలిపారు. కరోనా సమయంలో ప్రజలకు చికిత్స అందించడమే కాకుండా, ఆక్సిజన్ ఎ÷-లాంటును, ఆక్సిజన్ సిలిండర్లను తయారు చేసే యూనిట్‌ను నెలకొల్పినట్లు చెప్పారు. వైద్య పరంగా మహబూబ్‌నగర్ జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు.


# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు

## విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లిలకు కస్టడీ పొడిగింపు



**న్యూఢిల్లీ, నవంబర్ 18 (సమ సమాజం):** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఇద్దరు నిందితుల ఈడీ కస్టడీ ముగిసింది. విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లిలకు కస్టడీ పొడగిస్తూ సీబీఐ స్పెషల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈడీ అధికారుల అభ్యర్థన మేరకు కస్టడీని మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నవంబర్ 14న రౌస్ అవెన్యూ కోర్టు అభిషేక్ రావు, విజయ్ నాయర్? లకు 5 రోజుల కస్టడీ విధించింది. ఇది నేటితో ముగియడంతో ఈడీ అధికారులు వారిని కోర్టులో హాజరుపరిచారు. కస్టడీ పొడగించాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యాహ్నం విచారణ జరిపింది న్యాయస్థానం. దీంతో వారిద్దరికి మరో 5 రోజులు కస్టడీకి అనుమతించింది. తదుపరి విచారణను నవంబర్ 24వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పటికే ఇదే కేసులో శరత్ చంద్రారెడ్డి, బినోయ్ బాబుల కస్టడీని న్యాయస్థానం పొడిగించింది. శరత్ చంద్రారెడ్డి, బినోయ్ బాబుల నవంబర్ 21వ తేదీ వరకు కస్టడీ పొడిగించింది. మరోవైపు విచారణలో భాగంగా ఈడీ అధికారులు శుక్రవారం రాబిన్ డిస్టిలరీస్ డైరెక్టర్ అరుణ్ రామచంద్ర పి÷-లై, చా÷-టర్డ్ అకౌంటెంట్ గోరంట్ల బుచ్చిబాబును ప్రశ్నించారు. సౌత్ లాబీ గ్రూప్ నుంచి ఢిల్లీకి అక్రమంగా తరలించిన డబ్బుపై వీరిని ప్రశ్నించినట్లు సమాచారం. కాగా లిక్కర్ స్కామ్ లో భాగంగా దేశంలోని 40 ప్రాంతాల్లో ఏక కాలంలో ఈడీ సోదాలు చేపట్టింది. అయితే ఈ ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ప్రధానంగా తెలంగాణ, ఏపీ, తమిళనాడుకు చెందిన వారే ఉండటం గమనార్హం.

# మర్రి శశిధర్‌రెడ్డిపై కాంగ్రెస్ అధిష్టానం బహిష్కరణ వేటు



TELANGANA PRADESH CONGRESS COMMITTEE
GANDHI BHAVAN, HYDERABAD - 500001

Phone: 040-24603718
040-24602484
Fax: 040-24602383
040-24601254

Dr. G. CHINNA REDDY
Former Minister & Chairman, Disciplinary Action Committee


EXPULSION ORDERS – 19-11-2022

The Disciplinary Action Committee of TPCC has discussed at length that Shri Marri Shashidhar Reddy, Ex-Vice-Chairman, National Disaster Management Authority and former Minister of Andhra Pradesh, has met the Union Minister of Home Affairs Shri Amit Shah, at New Delhi, on 18-11-2022, along with Shri Bandi Sanjay, President, State BJP and Smt. D.K. Aruna, National Vice-President, BJP with a proposal to join BJP and also his remarks and utterances passed against Shri A. Revanth Reddy, President, TPCC on 19-11-2022.

The above activities of Shri Marri Shashidhar Reddy, Ex-Vice-Chairman, NDMA and former Minister of Andhra Pradesh, will attract the sacred disciplinary rules and guidelines of the Indian National Congress party Constitution.

Keeping in view of the tendency of the situation and anti-party activities of Shri M. Shashidhar Reddy, the DAC of TPCC, has taken a decision to expel him from the Congress party for a period of six years.

Hence, he is expelled from the Congress party for his anti-party activities with immediate effect and it is sent to AICC for ratification.



**పార్టీ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడ్డాడంటూ విమర్శలు**

**అమిత్‌షాతో కలవడంపై సీరియస్ అయిన అధిష్టానం**

**హైదరాబాద్, నవంబర్ 18 (సమ సమాజం):** మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డిపై కాంగ్రెస్ అధిష్టానం బహిష్కరణ వేటు వేసింది. పార్టీ నుంచి ఆయనను క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి బహిష్కరించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ బహిష్కరణ వేటు వేశారు. అయితే శశిధర్‌రెడ్డి బీజేపీలో చేరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. బీజేపీ నేతలు బండి సంజయ్, డీకే అరుణతో కలిసి శుక్రవారం రాత్రి కేంద్రమంత్రి అమిత్‌షాతో శశిధర్‌రెడ్డి భేటీ అయ్యారు. పార్టీలో చేరే విషయంపై చర్చించినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. గత రెండు రోజులుగా ఢిల్లీలో ఉన్న ఆయన.. పలువురు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరిపారు. అయితే అమిత్‌షాతో భేటీ సందర్భంగా సంజయ్‌తో తెలంగాణ రాజకీయాలపై చర్చించినట్లు చెబుతున్నారు. రెండు రోజులుగా శశిధర్‌రెడ్డి బీజేపీలో చేరుతున్నట్లు ప్రచారం జరిగింది. బండి సంజయ్ ఇతర నేతలో కలిసి ఆయన ఢిల్లీ వెళ్లారు. ఈ నేపథ్యంలోనే శశిధర్‌రెడ్డి బీజేపీలో చేరడం ఖాయమని ప్రచారం జరిగింది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. తాను ఢిల్లీకి రావడం కొత్తేమీ కాదని, మనవడి స్కూల్ ఫంక్షన్‌లో పాల్గొనడానికి వచ్చానని తెలిపారు. నేను ఇంకా రాజకీయాల్లోనే ఉన్నా. రిటైర్డ్ కాలేదు. నేను ఢిల్లీకి వచ్చిన విమానంలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. బీజేపీలో చేరడానికే నేను ఢిల్లీకి వచ్చానన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ప్రకటించడం గమనార్హం. కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డిపై వేటు వేసింది అధిష్టానం. కేంద్రమంత్రి అమిత్ షాను కలవడం.. కాంగ్రెస్ కు క్యాన్సర్ సోకింది.. పార్టీ పనైపోయిందంటూ ఆయన వ్యాఖ్యలకు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించింది. 6 సంవత్సరాల పాటు మర్రిని పార్టీ నుంచి బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక చర్యలతో క్రమశిక్షణ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజులుగా మర్రి బీజేపీలోకి వెళ్తున్నారని ప్రచారం సాగింది. దీన్ని ఆయన ఖండించారు. ఢిల్లీ వెళ్తే పార్టీ మారుతున్నట్టా అని ఎదురు ప్రశ్నించారు. సొంత పని మీదే వెళ్లానని చెప్పారు. కానీ, సడెన్ గా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో శుక్రవారం రాత్రి ఆయన భేటీ అయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు వీరి సమావేశం కొనసాగింది. ఈ భేటీకి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కూడా హాజరయ్యారు. అయితే.. శనివారం ఉదయం రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డా శశిధర్. టీఆర్ఎస్ ను ఎదుర్కొనే పరిస్థితిలో కాంగ్రెస్ లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీకి క్యాన్సర్ సోకిందని.. నయం చేయలేని స్థితికి చేరుకుందన్నారు. రేవంత్ రెడ్డి తీరుపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు.ఒక హోంగార్డు కాంగ్రెస్ నుంచి పోతే పోయేదేమిలేదని.. రేవంత్ వ్యవహారశైలి సరిగ్గా లేదని ఆరోపించారు. మునుగోడు ఉప ఎన్నికలో 10 కోట్లు ఖర్చు పెడతానని చెప్పి.. ఒక్క రూపాయి కూడా పెట్టలేదన్నారు. ఇంఛార్జులతో డబ్బు ఖర్చు పెట్టించి.. వారిని డొల్ల చేశారని ఖర్చు పెట్టకపోతే టికెట్లు, పదవులు ఇవ్వనని బెదిరించారని ఆరోపించారు. కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ అందుబాటులో ఉండడని.. చెంచాగాళ్లను పెట్టి పార్టీని నడిపిస్తున్నాడని విమర్శించారు. తనలాగే చాలా మంది పార్టీని వీడే అవకాశం ఉందని.. వచ్చే ఎన్నికల్లో 15 మందిని గెలిపించుకొని సొంత దుకాణం చూసుకోవాలని రేవంత్ భావిస్తున్నారని ఆరోపించారు. మర్రి చేసిన ఈ వ్యాఖ్యలపై అధిష్టానం సీరియస్ అయింది. క్రమశిక్షణా కమిటీ ఆరేళ్ల పాటు ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించింది.

# రోడ్ల మరమ్మత్తుల వెంటనే చేపట్టాలి

## అధికారులను ఆదేశించిన మంత్రి ఎర్రబెల్లి



**హైదరాబాద్, నవంబర్ 18 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని రోడ్లు అద్దంలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. హైదరాబాద్ లో శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో నిర్వహించిన వర్క్ షాప్ లో అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేశానికి రోల్ మోడల్ గా నిలిచిన తెలంగాణ లో ప్రజలు రోడ్లమీద ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే రోడ్ల మరమ్మతులు, నిర్వహణ ఎప్పటికప్పుడు చేపట్టాలి. పంచాయతీ రాజ్ శాఖ పునర్వవస్థీకరణ, అదనపు నిధులకు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. డిసెంబర్ 6వ తేదీ నాటికి కొత్త ఎస్.ఈ ఆఫీసుల ఏర్పాటు. 15వ తేదీ నాటికి రోడ్ల మరమ్మతుల టెండర్లు పూర్తి కావాలని' అన్నారు. ఈ ఏడాది రూ. 1500 కోట్ల బ్జడెట్ ఉందని, దీనికి రెట్టింపుగా రూ. 3వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వరదనీటితో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని వెల్లడించారు. రోడ్ల నిర్మాణంలో అటవీ భూముల సమస్యను గుర్తించి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పెంపు కోసం విదేశాల్లో అధ్యయనం చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనలను పక్కాగా అమలు చేస్తే భవిష్యత్ లో పంచాయతీ రూపు రేఖలు మారి శాఖ మరింత బలోపేతం అవుతుందన్నారు. శాఖ పునర్వ్యవస్థీకరణ వేగవంతానికి ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ వేసుకోవాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ సెక్రటరీ సందీప్ సుల్తానియా, ఇంజినీర్ ఇన్ చీఫ్ సంజీవరావు, చీఫ్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

# వారణాసిలో కాశీ తమిళ సంగం కార్యక్రమం

## సంప్రదాయంగా ప్రారంభించిన ప్రధాని మోడీ● తమిళ పంచెకట్టులో ఆకట్టుకున్న ప్రధాని

**వారణాసి, నవంబర్ 18 (సమ సమాజం):** కాశీ తమిళ సంగం కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రత్యేక ఆకర్శణగా నిలిచారు. తమిళ సంప్రదాయమైన పంచెకట్టులో సమావేశానికి ప్రధాని హాజరయ్యారు. వారనాసిలో ప్రారంభమైన కాశీ తమిళ సంగమం.. సదస్సుకు పంచకట్టుతో హాజరైన ప్రధాని ఉత్తరప్రదేశ్‌లో కాశీ తమిళ సంగం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశానికి వచ్చినవారిని ప్రత్యేకంగా పలకరించారు ప్రధాని మోదీ. కాశీలో 30 రోజుల పాటు ద్రవిడ సంస్కృతి, సంప్రదాయాల గురించి వివిధ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సంగమంలో తమిళ విద్యార్థులు, రచయితలు, పండితులు, పారిశ్రామికవేత్తలు, ఇతర పార్టీల నేతలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వారి వారి విభాగాలతో సంభాషించడానికి, స్థానిక నివాసితులతో సంభాషించడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. తమిళ సంగమం సందర్భంగా కాశీ నగరం సంబరాలతో నిండిపోయింది. తమిళనాడు నుంచి కాశీ వచ్చిన వారినిక ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా,'ఏక్ భారత్ శ్రేష్ట భారత్' స్ఫూర్తిని నిలబెట్టేందుకు భారత ప్రభుత్వం ఈ సంగమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి తిరుక్కురల్ ,కాశీ-తమిళ సంస్కృతికి సంబంధించిన పుస్తకాలను విడుదల చేశారు. తమిళ విద్యార్థులతో సంభాషించారు. తమిళనాడులోని మఠా దేవాలయాల ఆదినాములకు (మఠాధిపతులకు) కూడా గౌరవం ఇస్తూ వారి ఆశీర్వాదాలను కూడా ప్రధాని మోదీ కోరనున్నారు.కాశీలో నేటి నుంచి కాశీ-తమిళ సంగమం ఉత్సవాలు జరగనున్నాయి. తమిళనాడుకు చెందిన ద్రవిడ సంస్కృతి గురించి యూపీలో ప్రదర్శన చేయనున్నారు. తమిళ వంటకాలు అక్కడ గుమగుమలాడనున్నాయి. తమిళ సంగీతం కూడా కాశీలో మారుమోగనున్నది. కాశీ తమిళ సంగమం కోసం రామేశ్వరం నుంచి ప్రత్యేక రైలులో 216 మంది ఇవాళ వారణాసి చేరుకున్నారు. ఆ బృందానికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వాగతం పలికారు. కాశీలో 30 రోజుల పాటు ద్రవిడ సంస్కృతి, సంప్రదాయాల గురించి వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కాశీ తమిళ సంగమం ఈవెంట్‌లో పాల్గొనేందుకు సుమారు మూడు వేల మంది తమిళనాడు భక్తులు 12 బృందాలుగా కాశీ చేరుకోనున్నారు.




# సిట్ నోటీసులను రద్దు చేయలేం

## బిజెపి పిటిషన్‌పై హైకోర్టు వ్యాఖ్య

## మంగళవారానికి విచారణ వాయిదా

**హైదరాబాద్, నవంబర్ 18 (సమ సమాజం):** ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించి సిట్, బీజేపీ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేఉలో సిట్ నోటీసులను రద్దు చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. బీఎల్ సంతోష్, శ్రీనివాస్‌లకు 41 (ఏ)సీఆర్‌పీసీ నోటీసులు ఇవ్వడం మీడియాకు ఎలా లీక్ అవుతున్నాయని హైకోర్టు ప్రశ్నించింది. బీఎల్ సంతోష్‌కు సిట్ ఇచ్చిన నోటీసులను రద్దు చేయాలన్న బీజేపీ అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. సిట్ దర్యాప్తు గోప్యంగా ఉంచాలని ఆదేశించింది. సిట్ దర్యాప్తు పారదర్శకంగా జరగాలని సూచించింది. 41 (ఏ) సీఆర్‌పీసీలో అరెస్ట్ చేయడానికి వీళ్లేదని హైకోర్టు స్పష్టం చేశారు. ఈ విషయంపై ఢిల్లీ పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి అరెస్ట్ చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. సిట్ దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశించింది. ఢిల్లీ పోలీసులకు 41 (ఏ) నోటీసులు సిట్ అధికారులు ఇవ్వాలని... ఢిల్లీ పోలీసులు బీఎల్ సంతోష్‌కు సర్వ్ చేస్తారని పేర్కొంది. తదుపరి విచారణను హైకోర్టు మంగళవారానికి వాయిదా వేసింది.





# చలన చిత్రం

## 25న విడుదల కానున్న లవ్‌టుడే



అదే రోజు తెరపైకి వస్తున్న నరేశ్ చిత్రం

తమిళంలో బ్లాక్‌బస్టర్ వసూళ్ళతో దూసుకుపోతున్న లవ్‌టుడే సినిమాను తెలుగులో దిల్‌రాజు రిలీజ్ చేస్తున్నాడు. ప్రదీప్ రంగనాథన్ నటిస్తూ, దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంలో నవంబర్ 4న రిలీజై పాజిటీవ్ టాక్ తెచ్చుకుంది. ఈ చిత్రానికి తమిళ ప్రేక్షకుల నుండి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. దాంతో దిల్‌రాజు తెలుగులో ఈ సినిమాను భారీ స్థాయిలో రిలీజ్ చేయాలని సన్నాహాలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవలే విజయ్ దేవరకొండతో తెలుగు ట్రైలర్‌ను లాంచ్ చేయించాడు. లైటెస్ట్‌గా రిలీజైన ట్రైలర్ తెలుగు ప్రేక్షకులను కూడా విపరీతంగా ఆకట్టుకుంది. నేటి సమాజంలో లవ్ అనేది ఎలా ఉంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కినట్లు ట్రైలర్‌లో చూపించారు. ఈ చిత్రాన్ని నవంబర్ 25న తెలుగు వెర్షన్ రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే అదే రోజున అల్లరినరేష్ 'ఇట్లు మారేడుమిల్లి నియోజకవర్గం' రిలీజ్ అవుతుంది. ఇకపోతే లవ్‌టుడేలో కథ ఇద్దరు ప్రేమికుల చుట్టూ తిరుగుతుంది. ఇద్దరు ప్రేమికులు వాళ్ల ప్రేమను పెళ్ళివరకు తీసుకెళ్ళాలని నిర్ణయించుకుంటారు. ఈ క్రమంలో అబ్బాయి, అమ్మాయి వాళ్ల నాన్నతో పెళ్లి గురించి మాట్లాడాలని ఆయన్ని కలుస్తాడు. అయితే అమ్మాయి తండ్రి వీళ్ళిద్దరికి ఓ టెస్ట్ పెడతాడు. వీరిద్దరిని ఒకరి ఫోన్ ఒకరు ఎక్స్‌చేంజ్ చేసుకోని ఒక రోజు ఉండమంటారు. మరుసటి రోజు కూడా పెళ్ళి చేసుకుందాం అనుకుంటే తనకు డబుల్ ఓకే అని చెప్తాడు. దాంతో ఈ ఇద్దరు ప్రేమికులు బయపడుతూనే ఒకరి ఫోన్ మరోకరు ఎక్స్‌చేంజ్ చేసుకుంటారు. ఆ తర్వాత మెల్లిగా ఒకరి పర్సనల్ విషయాలు మరోకరికి తెలిసిపోతుంటాయి. ఈ క్రమంలో వారిద్దరి మధ్య గొడవలు స్టార్ట్ అవుతాయి. ఆ గొడవలు పెళ్లి వరకు తీసుకెళ్తాయా.. లేదా మధ్యలోని పెళ్లి పెటాకులవుతుందా అనే కథాంశంతో ఈ సినిమా రూపొందింది.






## యశోద చిత్రం విజయోత్సాహంలో సమంత

**చిత్ర యూనిట్ బాగా కష్టపడిందంటూ ఎమోషన్**

సరోగసి నేపథ్యంలో సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ చిత్రం 'యశోద'. హరి-హరీష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత వారం ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటీవ్ రివ్యూలను తెచ్చుకుంది. సమంత జరిపిన ప్రమోషన్స్ కూడా సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. దాంతో ఈ చిత్రానికి భారీగా ఓపెనింగ్స్ వచ్చాయి. సినిమాలో సమంత పాత్ర, నటనకు సైతం మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా సక్సెస్‌పై సమంత సంతోషం వ్యక్తం చేసింది. ఇప్పుడు తన మనసు గాల్లో తేలుతున్నట్లుగా ఉందంటూ ట్విట్టర్ ద్వారా తన ఆనందాన్ని వ్యక్త పరిచింది. 'యశోద సినిమాపై మీరు చూపిస్తున్న ప్రేమ, ఆదరణకు ధన్యవాదాలు. మీ ప్రశంసలు, మద్దతే నాకు లభించిన అతిపెద్ద బహుమతి. సినిమాకు వస్తున్న స్పందన నాకెంతో సంతోషాన్ని ఇస్తోంది. థియేటర్లలో మీ సంబరాలు చూశా. సినిమా ఎలా ఉందో మీరు చెప్పిన మాటలు విన్నా. దీని వెనుక మా చిత్ర బృందం నిర్విరామంగా పడిన కష్టం కనిపిస్తోంది. ఇప్పుడు నా మనసు గాల్లో తేలుతున్నట్టుగా ఉంది. యశోద ప్రాజెక్టులో భాగస్వామ్యం అయిన వాళ్లందరికీ థ్యాంక్స్. నా పైన నమ్మకం ఉంచిన నిర్మాత, శ్రీదేవి మూవీస్ శివలెంక కృష్ణప్రసాద్, దర్శకులు హరి-హరీష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు' అంటూ ట్వీట్ చేసింది. యశోద చిత్రంలో చిత్రంలో రావు రమేశ్, వరలక్ష్మి శరత్ కుమార్ కీలకపాత్రల్లో నటించారు. మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో.. ఈ చిత్రాన్ని శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ మూవీలో ఉన్ని ముకుందన్ కీలక పాత్ర పోషించారు.

## 21న హనుమాన్ టీజర్ విడుదల

'అ!', 'కల్కి', 'జాంబిరెడ్డి' వంటి వినూత్న సినిమాలను తెరకెక్కిస్తూ టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు ఏర్పరుచుకున్నాడు ప్రశాంత్ వర్మ. ప్రయోగాత్మక సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరు సంపాదించు కున్నాడు. ప్రస్తుతం ఈయన సూపర్ హీరో ఫాంటసీ నేపథ్యంలో 'హనుమాన్' అనే పాన్ ఇండియా సినిమాను రూపొందిస్తున్నాడు. తేజా సజ్జా హీరోగా నటిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరపుకుంటుంది. ఇప్పటికే రిలీజైన పోస్టర్‌లు, గ్లింప్స్ ప్రేక్షకులలో భారీ అంచనాలు క్రియేట్ చేశాయి. తాజాగా చిత్రబృందం టీజర్ అప్‌డేట్‌ను ప్రకటించింది. ఈ సినిమా టీజర్‌ను ముందుగా నవంబర్ 15న రిలీజ్ చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కానీ సూపర్ స్టార్ కృష్ణ మరణించడంతో టీజర్ రిలీజ్‌ను పోస్ట్ పోన్ చేశారు. కాగా తాజాగా మేకర్స్ కొత్త డేట్‌ను వెల్లడించారు. హనుమాన్ టీజర్‌ను నవంబర్ 21న రిలీజ్ చేస్తున్నట్లు చిత్రబృందం పేర్కొంది. సూపర్ హీరో ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తేజ సజ్జాకు జోడీగా అమృత అయ్యర్ నటిస్తుంది. వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్ర పోషిస్తుంది. డాక్టర్ ఫేం వినయ్‌రాయ్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రథమార్థంలో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## శరవేగంగా వీరసింహారెడ్డి షూటింగ్

**ఆరుపదుల్లోనూ జోష్‌లో ఉన్న బాలయ్య**




ఆరుపదుల వయసులోనూ వరుసగా యాక్షన్ సినిమాలు చేస్తూ యువ హీరోలకు సవాళ్ విసురుతున్నాడు నందమూరి బాలకృష్ణ. ఎంతో కాలంగా హిట్టు కోసం ఎదురు చూస్తున్న బాలకృష్ణ.. గతేడాది 'అఖండ'తో గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చాడు. ద్విపాత్రాభినయంలో బాలయ్య నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ముఖ్యంగా అఘోర పాత్రలో బాలకృష్ణ నటన వర్ణనాతీతం. ప్రస్తుతం బాలయ్య అదే జోష్‌లో 'వీరసింహా రెడ్డి' చిత్రాన్ని చేస్తున్నాడు. ఇప్పటికే చిత్రం నుండి రిలీజైన పోస్టర్‌లు, టీజర్ గ్లింప్స్ సినిమాపై విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. ఎప్పుడెప్పుడు సినిమా రిలీజవుతుందా అని నందమూరి అభిమానులతో పాటు, ప్రేక్షకులు కూడా ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానుంది. ఈ సినిమా తర్వాత బాలకృష్ణ, అనీల్ రావిపూడితో మాస్ ఎంటర్‌టైనర్ చేయనున్నాడు. కెరీర్ బిగెనింగ్ నుండి కమెడీ కథలనే నమ్ముకుని హిట్లు కొడుతున్ అనీల్ రావిపూడి.. మొదటి సారిగా యాక్షన్ సినిమా చేస్తున్నాడు. అది కూడా మాస్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన బాలకృష్ణతో. ఫాదర్-డాటర్ ఎమోషన్‌తో సాగే ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. కాగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ బిగ్ అప్డేట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 8న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్లు తెలుస్తుంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుంది. ఈ చిత్రంలో బాలకృష్ణ 45 సంవత్సరాలున్న తండ్రి పాత్రలో కనిపించనున్నాడు. బాలయ్య కూతురుగా 'పెళ్లిసందడి' హీరోయిన్ శ్రీలీల నటిస్తుంది. ÷సాహు గారిపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నాడు.


## కీడా కోలా చిత్రంలో వస్తోన్న తరుణ్ భాస్కర్




పెళ్లిచూపులు, ఈ నగరానికి ఏమైంది చిత్రాలతో దర్శకుడిగా ప్రూవ్ చేసుకున్న తరుణ్ భాస్కర్, కొన్ని సినిమాలకు రైటర్‌గా, మరికొన్ని సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బిజీ అయ్యాడు. దాదాపు నాలుగేళ్ల తర్వాత మళ్లీ మెగా ఫోన్ పట్టాడు తరుణ్. 'కీడా కోలా' అనే వెరైటీ టైటిల్‌తో సినిమా రూపొందిస్తున్నాడు. శుక్రవారం నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టారు. కూల్ డ్రింక్ క్యాప్ కింద బొద్దింకను చూపిస్తూ డిఫరెంట్ పోస్టర్‌తో సినిమాని అనౌన్స్ చేసిన టీమ్.. ఇందులో ఎవరెవరు నటిస్తున్నారనేది మాత్రం అనౌన్స్ చేయలేదు. కాంట్రవర్సీ స్జబెక్ట్‌తో కామెడీ మూవీని తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ప్యాన్ ఇండియా మూవీగా తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది రిలీజ్ చేయనున్నట్టు మాత్రం ప్రకటించారు. వీజీ సైన్మా, క్విక్ ఫాక్స్ సంస్థలు కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

## రవి జాదవ్ దర్శకత్వంలో వాజ్‌పేయ్ బయోపిక్

**వాజ్‌పేయ్ పాత్రలో మిర్జాపూర్ నటుడు పంకజ్ త్రిపాఠీ**



ఈ మధ్య కాలంలో బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తుంది. తెలిసిన కథలనే ఆసక్తికర కథనంతో తెరకెక్కిస్తే బయోపిక్ సినిమాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. అయితే అన్ని బయోపిక్‌లు బాక్సాఫీస్ దగ్గర హిట్లు కావడం లేదు. ఎంత పెద్ద సెలబ్రిటీ బయోపిక్ అయినప్పటికీ, కథ ఆసక్తికరంగా ఉండి కేవలం నిజాలను మాత్రమే చూపిస్తేనే బయోపిక్‌లు హిట్ అవుతున్నాయి. ఇప్పటికే ఇండియన్ సినీ సెలబ్రెటీలు, స్పోర్ట్స్ పర్సన్స్, రాజకీయ నాయకుల ఇలా చాల మంది బయోపిక్‌లు తెరకెక్కాయి. అయితే అందులో హిట్ల కంటే ఎ÷-లాపులే ఎక్కువగా ఉన్నాయి. ఇదిలా ఉంటే భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ బయోపిక్ తెరకెక్కనుంది. రవి జాదవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. అయితే సినిమా ప్రకటించినప్పుడు చిత్రబృందం వాజ్‌పేయీ పాత్రలో ఎవరు నటిస్తారు అనేది క్లారిటీ ఇవ్వలేదు. కాగా తాజాగా ఈ సినిమా కథానాయికుడిని మేకర్స్ ప్రకటించారు. వాజ్‌పేయీ పాత్రలో మిర్జాపూర్ నటుడు పంకజ్ త్రిపాఠీ నటించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా వాజ్‌పేయీ పాత్రలో నటించడంపై పంకజ్ త్రిపాఠి మాట్లాడుతూ 'వాజ్‌పేయీ కేవలం రాజకీయవేత్త మాత్రమే కాదు.. మంచి మానవతావాది, రచయిత, కవి కూడా. ఇలాంటి గొప్ప నాయకుడి పాత్రలో నటించడానికి అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నట్లు' పంకజ్ తెలిపాడు. ఈ చిత్రాన్ని వాజ్‌పేయీ 99వ జయంతి సందర్భంగా వచ్చే ఏడాది క్రిస్మస్‌కు రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం పేర్కొంది. 'గ్యాంగ్ ఆఫ్ వసీపూర్', 'మిర్జాపూర్' వంటి సిరీస్‌లతో బాలీవుడ్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు పంకజ్ త్రిపాఠీ. తెలుగులో పంకజ్ 'దూసుకెళ్తా' సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో నటించాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in